హైదరాబాద్ వార్త



## కుటుంబ తగాదాలతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం


గాయాలతో సురేష్

ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త : ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కంచె సురేష్(30)ని కుటుంబ తగాదాల కారణంగా భార్యాపిల్లలు వదిలేసి వెళ్లిపోయారు. ఏడాదిన్నర క్రితం భార్యపిల్లలు వదిలేసి వెళ్లిపోవడంతో మన స్థాపానికి గురైన సురేష్ గురువారం మధ్యాహ్నం కొత్తపేట చౌరస్తాలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం తెలిసిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి సురేష్‌ను తరలించారు. ఒళ్ళు కాలి గాయాలతో ఉన్న సురేష్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. ఈ విషయమై సురేష్ సోదరుడు నర్సింగ్‌రావును కూడా విచారించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# డేటా చోరీ జాగ్రత్త!




"ఈలింక్ క్లిక్ చేయండి.. మీ వాట్సాప్ పింక్‌గా మారిపోతుంది. ఒక్కసారి ట్రై చేయడం. అమెజాన్‌లో బంపర్ ఆఫర్లు .. తెలుసుకోవాలన్నా.. కొనుగోలు చేయాలన్నా ఈకింది లింక్ ఓపెన్ చేయండి" మీరు లక్కీడ్రాలో లక్షల రూపాయలు గెలుచుకున్నారు. ఈక్రింద లింక్‌లో మీసమాచారం పొందుపరచండి "అంటూ ఇలా ప్రస్తుతం ప్రతిఒక్కరి సెల్‌ఫోన్‌లకు ఈరకమైన మెసేజ్‌లు వస్తున్నాయి. పొరపాటున ఎవరైనా వాటిపై క్లిక్ చేస్తే వాట్సాప్ ఐకాన్ రంగు మారదుకదా.. ఆసెల్‌ఫోన్‌లోని సమస్త సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా లింకులను ఎరగా వేసి మన సెల్‌ఫోన్‌లో డేటాను తస్కరించే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**క్లిక్ చేస్తే**

**అంతేసంగతులు**

**సెల్‌ఫోన్లకు వాట్సాప్,**

**ఎస్ఎంఎస్‌ల ద్వారా మెసేజ్‌లు**

**ఆఫర్లు గెలుచుకున్నారంటూ**

**లింకులు పంపుతున్న సైబర్ నేరగాళ్లు**

**లింకులు ఓపెన్ చేస్తే సెల్‌ఫోన్‌లోని డేటా చోరీ**

**అప్రమత్తంగా ఉండాలి : సైబర్ క్రైం పోలీసులు**



హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలను దోచుకునేందుకు సైబర్ నేరగాళ్ల రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నాల్ల కిందటివరకు లాటరీ గెలుచుకున్నారని, ఏటిఎం కార్డు అప్‌డేట్ చేయాలని ఫోన్‌లు చేసి బ్యాంకు ఖాతా నంబర్, ఏటిఎం కార్డు నంబర్, పిన్‌నెంబర్ వంటి సమాచారం సేకరించి నగదును కొల్లగొట్టేవారు. ఈతరహా మోసాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ నేరగాళ్ల కొత్త వ్యూహం అమలు చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ కలిగిఉన్నవారికి స్పామ్‌లో ఒకలింక్‌ను పంపిస్తున్నారు. ఆలింక్‌పై క్లిక్ చేయగానే వాట్సాప్ రంగు మారిపోతుంది, అత్యంత చౌకగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులోకి వస్తాయని మెసేజ్ పంపిస్తున్నారు. నిజమేననుకుని ఎవరైనా పొరపాటున ఆతరహా లింక్‌పై క్లిక్ చేస్తే చాలా.. ఆఫోన్‌లోకి వైరస్ చొరబడుతుంది. దీంతో ఫోన్ నియంత్రణ మొత్తం ఎక్కడో ఉన్న సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. సెల్‌ఫోన్‌లోని మెసేజ్‌లు, కాంటాక్ట్ నంబర్లు, గ్యాలరీలోని ఫోటోలు, వీడియోలు, ఫోన్‌లో భద్రపరచుకున్న డ్యాక్యూమెంట్లు, ఇతర సమాచారం మొత్తాన్ని సైబర్‌నేరగాళ్ల ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వీలుకలుగుతుంది. ఒకవేళ ఏవైనా అభ్యంతరకరమైన ఫోటోలు, ఏకాంతంగా గడిపినప్పుడు తీసుకున్న ఫోటోలు, వీడియోలు ఉంటే వాటి ఆధారంగా బ్లాక్‌మెయిలింగ్‌కు దిగుతారు. బ్యాకులు, ఏటీఎం కార్డులకు సమాచారం ఉంటే ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో ఖాతాను లూటీ చేసేస్తారు. ఇటీవల కాలంలో పింక్ వాట్సాప్ అంటూ ఒక లింక్ వైరల్ అవుతుంది. చూసేందుకు అచ్చంగా వాట్సాప్ ఐకాన్ మాదిరిగానే ఉండటంతో కొంతమంది తెలియకుండానే లింక్‌ను క్లిక్ చేసేస్తున్నారు. వాట్సాప్ ఐకాన్ రంగు మారకపోవడంతో అది ఫేక్ లింక్ అనుకుని తిరిగి తమ పనిలో నిమగ్నమై పోతున్నారు. కానీ ఆతర్వాత వారికి తెలియకుండానే వారి సెల్‌ఫోన్ నుంచి తమ కాంటాక్టు లిస్ట్ ఉన్నవారందరికీ వాట్సాప్‌లో అదేలింక్ షేర్ అయిపోతుంది. తన సెల్‌ఫోన్ నుంచి ఆమెసేజ్ వెళ్ళినట్లు క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్ప వారికి తెలియని పరిస్థితి ఎదురవుతుంది. నగరంలోని ఈతరహా మోసాలపై ఫోలీసులకు ఫిర్యాదు అందుతున్నాయి. **అనవసర లింకులు ఓపెన్ చేయొద్దు..** సెల్‌ఫోన్‌కు వచ్చే అవనవసర లింకులపై క్లిక్ చేయడం ప్రమాదం. సైబర్ నేరగాళ్ల కొత్తఎత్తులతో నిత్యం ప్రజలను మోసం చేయాలనే ప్రయత్నిస్తుంటారు. అందుకోసం ఖండాంతరాల్లో ఉంటూ కంప్యూటర్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుంటారు. కాబట్టి తమకు తెలియయని వ్యక్తులు లేదా నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, స్పామ్ మెసేజ్‌ల జోలికి వెళ్లకపోవడమే శ్రేయస్కరం. చాలామంది వాటిపై క్లిక్ చేసి ఏముందో చూద్దామనే భావనతో ఉంటున్నారు. దీనవల్ల సెల్‌ఫోన్‌లోని డేటా అవతలివారికి చేరడంతో పాటు సెల్‌ఫోన్ నియంత్రణ కూడా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లిపోతుంది.

**వ్యక్తిగత డేటా చోరీ కేసులో 9మంది అరెస్ట్**

దేశవ్యాప్తంగా కోట్లమంది వ్యక్తిగత డేటా చోరీ కేసు హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. నాగపూర్ ,ముంబై,ఢిల్లీకి చెందిన ముఠా సభ్యులు ..దేశంలోని కోట్లాదిమంది పర్సనల్ డేటా, గ్యాస్‌డేటాను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు సామాన్యులకు ఫోన్ చేసి బిల్‌పే చేయలేదని, అప్‌డేట్ చేయాలని, మెసేజ్‌లు చేస్తుంటారని గుర్తించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 16కోట్లమంది వ్యక్తిగత డేటా చోరీ చేసినట్లు కనుగొన్నారు. దీంట్లో ప్రముఖంగా ఉమెన్ డేటా కూడా చోరీకిగురైందని గుర్తించారు. అలాగే వివిధ కంపెనీలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, లోన్లకోసం అప్లై చేసుకున్న దాదాపు 4లక్షల మంది డేటా చోరీకి గురైందని పోలీసులు వెల్లడించారు. అంతే కాదు ..డిఫెన్స్,ఆర్మీ ఉద్యోగుల సెన్సిటివ్ డేటటాను సైతం చోరీ గురైందని తేల్చారు. ఫేస్‌బుక్, ట్విటర్ వాడే 7లక్షలమంది వ్యక్తిగత డేటా, వారి ఐడీలు, పాస్‌వర్డులను సైబర్ నేరగాళ్లు చోరీ చేసినట్లు గుర్తించారు. దేశంలోని 16కోట్ల 80లక్షలమంది డేటాను సైబర్ నేరగాళ్లకు నిందితులు అమ్మకానికి పెట్టారని గుర్తించారు. ఈకేసులో మొత్తం 9మందిని అరెస్ట్ చేశారు.

### ఆకాశంలో నెలవంక కనిపించటంతో..
## ప్రారంభమైన పవిత్ర రంజాన్ మాసం

రంజాన్ వేళలు : 24వ తేదీ శుక్రవారం
షహర్ : శుక్రవారం ఉదయం 5.05 గంటలు
ఇఫ్తార్ : శుక్రవారం సాయంత్రం 6.28 గంటలకు

చార్మినార్, మార్చి 23 ప్రభాతవార్త : ఆకాశంలో నెలవంక కనిపించటంతో గురువారం రాత్రి నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అయ్యింది. రంజాన్ నెలలో ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేస్తారు. ఉపవాస సమయంలో ముస్లింలు కనీసం మంచి నీళ్లు కూడ ముట్టరు. రంజాన్ నెలలో పేదలకు దానధర్మాలు చేస్తారు. కాగా గురువారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనమివ్వటంతో ముస్లింలు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రతీ రోజు సాయంత్రం ఉపవాస దీక్షలు విడిచి పెట్టిన అనంతరం ముస్లింలు బంధు మిత్రులతో కలిసి ఇఫ్తార్ విందులలో పాల్గొంటారు. రంజాన్ మాసం మనశ్శాంతి పొందే మాసం. రంజాన్ నెల పరమ పవిత్రమైనది. ఈ మాసంలో ముస్లింలు ఎంతో నిష్టతతో నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలలో పాల్గొంటారు. కాగా చారిత్రక మక్కామసీదు, జమామసీదు, చౌక్ మసీదుతో పాటు పాతబస్తీలోని అన్ని మసీదులను అందంగా తీర్చిదిద్దారు. రంజాన్ మాసం సందర్భంగా మక్కామసీదులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మక్కామసీదు ఆవరణలో టెంట్‌లతో పెద్ద ఎయిర్ కూలర్లు నెలకొల్పారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో ప్రీతితో హాలీంను తింటారు. నెల రోజుల పాటు హాలీంకు పెద్ద ఎత్తున గిరాకీ ఉంటుంది. పాతబస్తీలోని శాలిబండ, ఫలక్‌నుమా, చార్మినార్, మదీనా, మొగల్‌పుర, కిషన్‌బాగ్, కాలాఫత్తర్‌తో పాటు పలు ప్రాంతాలలోని హోటళ్ల యజమానులు ప్రత్యేకంగా హాలీం తయారు చేసి విక్రయిస్తారు. విద్యుత్, వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి, మైనార్టీ శాఖలకు చెందిన అధికారులు రంజాన్ మాసం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆకాశంలో నెలవంక కనిపిచంటంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైందని మక్కామసీదు సూపరింటెంట్ ఎంఎ సిద్దిఖి తెలిపారు.


విద్యుత్ దీపాల కాంతులలో దగదగ మెరిసి పోతున్న మక్కామసీదు

**మక్కామసీదులో యౌముల్ ఖురాన్ పఠన కార్యక్రమం**

రంజాన్ మాసంలో మక్కామసీదులో ప్రతీ శుక్రవారం జరిగే ప్రత్యేక ప్రార్దనలు అనంతరం యౌముల్ ఖురాన్ పఠాన్ కార్యక్రమం జరుగుతుంది. రంజాన్ మాసంలోని మొదటి, నాలుగు, ఐదు శుక్రవారాలు ఎంఐఎంకు, రెండవ శుక్రవారం ఆల్ ఇండియా సున్నీ ఉల్మా బోర్డుకు, మూడవ శుక్రవారం ఎంబిటికి కేటాయిస్తూ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసిందని మక్కామసీదు సూపరింటెంట్ ఎంఎ సిద్దిఖి వెల్లడించారు.

### మంచినీటి పొదుపుపై అవగాహన ర్యాలీ

చార్మినార్, మార్చి 23 ప్రభాతవార్త : ప్రపంచ మంచి నీటి దినోత్సవం సందర్భంగా పాతబస్తీలో గురువారం దూద్‌బౌలి జలమండలి, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మంచి నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమం డిజిఎం మహ్మద్ హాకీం, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు సుభాష్ చంద్ర, ఎ.శివకుమార్, యశ్వంత్ వాటర్ వర్క్ మేనేజర్లు భాను ప్రకాష్‌రెడ్డి, శశిధర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. పాతబస్తీలోని పలు ప్రాంతాలలో మంచి నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న వాటర్ వర్క్స్ అధికారులు

## సంగేశ్వర వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ అమ్మవారికి వసంత నవరాత్రులు

నాంపల్లి, మార్చి 23 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న నిర్వహించబడుతున్న అత్యంత పురాతన శ్రీ సంగేశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో ఈ నెల 23 చైత్రశుద్ధ పాడ్యమి బుధవారం నుండి 31వ తేదీ శుక్రవారం చైత్రశుద్ధ దశమి వరకు శ్రీ పార్వతీ అమ్మవారికి వసంత నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుపుతున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణా ధికారి పి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీరోజూ ఉదయం 8గంటలకు సహస్రనామం; రాత్రి 6గంటలకు కుంకుమార్చనలు ఉంటాయని, చైత్రశుద్ధ నవమి గురువారం 30న శ్రీరామనవ మిని పురస్కరించుకొని ఉదయం 10.30గంటల నుండి పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో శ్రీ కోదండ రామచంద్ర స్వామి వారికి శ్రీ సీతాదేవికి వేదమంత్రోచ్ఛారణల మధ్య భక్తజన సందోహ సమక్షంలో భాజాభజంత్రీలతో పూలపందిరిలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం భక్తిప్రపత్తులతో అత్యంత వైభవోపేతంగా జరుపబడుతుందని, అనంతరం అన్నదాన కార్యక్రమం, రాత్రి 7గంటల నుండి పురవీధుల్లో రథోత్సవం జరుపబడుతుందని ఆయన వివరించారు. శ్రీ హనుమత్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 6 గురువారం శ్రీ ఆంజనేయ స్వామి వారికి ఉదయం 5గంటల నుండి పంచామృత అభిషేకం, సింధూర అలంకరణ, సహస్రనామ ఆకుపూజ, అష్టోత్తర శతనామాది పూజా కార్యక్రమాలు, ఉదయం 10గంటలకు మన్యుసూక్త హోమం జరుపబడుతుందని దేవాలయ కార్యనిర్వహణాధి కారి పి.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. 10రోజులపాటు జరిగే ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాకార్యక్రమాల్లో పాల్గొని తరించి శ్రీ పార్వతీ అమ్మవారి, శ్రీ సీతారామ స్వాముల వార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

### 400కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్44 రోడ్డు విస్తరణ పనులు



కొంపల్లి, మార్చి 23 ప్రభాతవార్త: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారి 44ను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొంపల్లి రైల్వే బ్రిడ్జి నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు సుమారు 400కోట్ల వ్యయంతో దాదాపు 10కి.మీ 6లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఎన్‌హెచ్44 రోడ్డు మధ్య భాగం నుంచి ఇరువైపుల 125ఎస్ఎఫ్‌టీ వరకు విస్తరించి మూడు ఫ్లైఓవర్ బ్రిడ్జిలతో నిర్మిస్తున్నామని ఎన్‌హెచ్ఏఐ మేనేజర్ తరుణ్ తెలిపారు. సుచిత్ర-డైరీఫామ్, సినీప్లానెట్-జీడిమెట్ల, కొంపల్లి-దూలపల్లి సర్వీస్ రోడ్డు నుంచి హైవే రోడ్డు మధ్యలో ఉన్న సుమారు 1200చెట్లను దూలపల్లి ఫారెస్ట్‌కు తరలించి రీప్లాంటేషన్ చేశామని, మరికొన్ని చెట్లను త్వరలోనే తరలించి రీప్లాంటేషన్ చేసి జూన్2024వరకు రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

### నేడు నార్సింగి నూతన పోలీసు స్టేషన్ భవనం ప్రారంభం

నార్సింగి, మార్చి 23 ప్రభాతవార్త : సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోని నార్సింగి పోలీసు స్టేషన్ నూతన భవనంను శుక్రవారం ప్రారంభించబోతున్నట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హోంమంత్రి మహ్మూద్ అలీ, విద్యాశాఖ మంత్రి పి.సబిత ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, సుంకరి రాజు, వాణిదేవి, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, డిజిపి అంజనీ కుమార్, సైబరాబాద్ పోలీసు కమీషనర్ స్టీఫెన్ రవీంద్రల చేతులపై నూతన పోలీసు స్టేషన్ భవనం ప్రారంభం కాబోతుందని వివరించారు. నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు కూడా పాల్గొంటారని తెలిపారు.

## వైభవంగా ఇండియన్‌ప్రైడ్, శ్రీశోభకృత్‌నామ ఉగాది మీడియా పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, మార్చి 23 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, తిరుమల బ్యాంక్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు 24శుక్రవారం మధ్యాహ్నం 1నుండి రాత్రి 10గంటల వరకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ నేపథ్య గాయని పద్మశ్రీ అనురాధ పాడ్వాల్‌కు ఇండియన్ ప్రైడ్, పలువురికి శ్రీశోభకృత్‌నామ ఉగాది మీడియా పురస్కారాల ప్రదానోత్సవం, అనురాధ పాడ్వాల్‌చే ప్రత్యేక హిందీపాటలు, ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో వర్ధమాన గాయకులచే సీల్‌వెల్ సినీ సుస్వరాలు-32 పేరిట ఉగాది కోయిల సినీగీతాల కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఈఓ బండారు సుబ్బారావు, తిరుమల బ్యాంక్ ఛైర్మన్ చంద్రశేఖర్, శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి డా. వి.శ్రీనివాస్‌గౌడ్‌లు, విశిష్ట అతిథులుగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, టి.జితేందర్, నీరజ్ లకోటియా, కొత్త కృష్ణవేణి, శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయుడు డా. మహ్మద్‌రఫీ, కుసుమ భోగరాజు, టి.పట్టాభి తదితరులు పాల్గొంటారని, అధిక సంఖ్యలో సినీసంగీత ప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాలను ఆస్వాదించి విజయవంతం చేయాలని బండారు సుబ్బారావు, చంద్రశేఖర్, ఆమనిలు కోరారు.

## కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలి

**రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తలసాని**



బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

బేగంపేట మార్చి 23,ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాతనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళణం కార్యక్రమం మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన విశ్వకర్మ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తలసాని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణా అని అన్నారు. 60,70 సంవత్సరాల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు కేసీఆర్ ప్రభుత్వంలో పరిష్కారం అయ్యాయని చెప్పారు. నిరంతరం ప్రజల కోసం పనిచేసే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని పేర్కొన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు అనేకం పరిష్కరించడం జరిగిందని వివరించారు. సనత్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండికూడా నియోజకవర్గ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. తదనంతరం ఆయన కుమారుడిని కూడా స్థానిక ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపిస్తే అధికారంలో ఉన్న ంత కాలం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి నియోజకవర్గ సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. నేడు మాయమాటలతో ప్రజల వద్దకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇక్కడి ప్రజల ఓట్లతో ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి 4సంవత్సరాల కాలంలో సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు ఏం చేసారో చెప్పగలరా ? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్లు మహేశ్వరి, కుర్మ హేమలత, కొలను లక్ష్మి, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, అత్తెల్లి మల్లి ఖార్జున గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, కట్టెల శ్రీనివాస్‌యాదవ్, టి.శ్రీహరి, కొసికె కిషోర్, పాటిగడ్డ గిరి పాల్గొన్నారు.

## కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాం : ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, మార్చి 23 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ గ్రామంకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త సత్తయ్య కుమారుడు నర్సింగ్‌రావు(32) లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తూ ఈనెల 18న ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ గురువారం సత్తయ్య ఇంటికి వెళ్ళి పరామర్శించారు. నిరుపేద కుటుంబం కావడంతో తనవంతుగా రూ,1లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సింగ్‌రావు కుటుంబానికి అండగా ఉంటామన్నారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి పరిహారం అందించే విధంగా కృషి చేస్తానని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణయాదవ్, ఫాక్స్ వైస్ ఛైర్మన్ నల్తూరి క్రిష్ణ, సీనియర్ నాయకులు జక్కుల శ్రీనివాస్‌యాదవ్, జగన్‌నాయక్, కుంటి వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, హనుమంతు, వీరచంద్రుడు, వీరేష్, హాజీ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

## కేంద్రంలో ఖాళీగా ఉన్న 16లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి

**గ్రూప్1 పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి.ఆర్.కృష్ణయ్య**

హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బిసి ఉద్యోగాలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో ఖాళీగా ఉన్న 16లక్షల ఉద్యోగాలు, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కాచిగూడలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో 72 ప్రభుత్వశాఖలో ,245ప్రభుత్వరంగ సంస్థలలో 16లక్షలు ఖాళీలు పెండింగ్‌లో పెడుతున్నారని కృష్ణయ్య ధ్వజమెత్తారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఉద్యోగులు రిటైర్ అయిన దశాబ్దాల తరబడి భర్తీ చేయకుండా ప్రభుత్వ యంత్రాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వెంటనే దేశంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అలాగే రాష్ట్రపబ్లిక్ సర్వీస్ కమిషన్ జరిపిన గ్రూప్1 సర్వీస్ పరీక్షల్లో జరిగిన అవకతవకల అంశం చాలా సీరియస్ అంశం అని దీనిపై వాస్తవాలు బయటకు రావాలంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.రామును ఆర్.కృష్ణయ్య నియమించారు. నాయకులు నీలం వెంకటేశం, భూపేష్‌సాగర్, రాము, కోలా జనార్ధన్, నందగోపాల్, రాజ్‌కుమార్, సుధాకర్, నిఖిల్, రాంబాబు, నవీన్ పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

## యువత రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలి: ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రావు

యూసుఫ్‌గూడ, మార్చి 23, ప్రభాతవార్త : యువత రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తూ తగినవిధంగా డ్రైవింగ్ చేసుకోవాలని ట్రాఫిక్ డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్ (టిటిఐ) బేగంపేట అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్‌రాజు అన్నారు. గురువారం బంజార హిల్స్ రోడ్డునెంబర్ 3లో టెనెట్ డయాగ్నోస్టిక్స్‌లో సిబ్బందికి రోడ్డు భద్రత ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు స్టాఫ్‌లైన్ ట్రిబుల్ రైడింగ్ మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని ట్రాఫిక్ పోలీసులు రహదా రులపై ఏర్పాటు చేసి నిబంధనలను పాటించాలని ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయకూడదని రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేయడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని దాని వలన వారి అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వారి కుటుంబాలలో విషాదం నెలకొంటుందని అలా జరుగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాలను అతివేగంగానడపడం ఎపుడు ప్రమాదకరమే అన్నారు. దాదాపు 60మంది సిబ్బందికి ఈసలహాలు సూచనలు చేయడం జరిగిందని ఏసిపి జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టిటిఐ సిబ్బంది వెంకట ప్రసాద్, నర్సింహా, టెనెట్ డయాగ్నోస్టిక్ మానేజర్ నాగరాజు, బసీర్ ఉద్దీన్, చిన్నరాయుడు పాల్గొన్నారు.


టెనెట్ డయాగ్నోస్టిక్‌లో ట్రాఫిక్‌పై అవగాహన నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏసిపి జి.శంకర్‌రాజు

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్, ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు: పి.విజయారెడ్డి

ఖైరతాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: అధికారంలోకి కాంగ్రెస్ వస్తే రూ.500లకే గ్యాస్ ఇస్తామని, నిరుపేదలకు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు అందిస్తామని టి.పిసిసి ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేర్కొంటున్నారు. 'హాత్ సే హాత్ జోడో' పాద యాత్రలో భాగంగా స్థానికంగా ప్రజలను కలుసుకుంటూ కరపత్రాలు పంచుతూ ఇటీవల గత నాలుగు రోజులుగా ఖైరతాబాద్‌లోని పలు ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పార్టీ అధినేత రాహుల్ గాంధీ నేతృత్వంలో తమ నేత టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు డివిజన్‌ల, బస్తీల, కాలనీలలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని కరపత్రాలను ఇంటింటికి పంచుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరిస్తున్నామని విజయారెడ్డి స్పష్టం చేస్తున్నారు. మహిళలు ముందుకు వచ్చి తమ గోడు చెబుకుంటున్నారని ఆమె పేర్కొంటున్నారు.

## భగత్‌సింగ్ విగ్రహానికి నివాళ్లు



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న బిజెపి నాయకులు ఎన్ఆర్ లక్ష్మన్‌రావుగుప్త తదితరులు

అఫ్జల్‌గంజ్, మార్చి 23 ప్రభాతవార్త: భగత్‌సింగ్,దేశ స్వాతంత్ర్య కోసం తన ప్రాణాలను అర్పించిన గొప్ప విప్లవీరుడని భజరంగ్‌సేనా ఉపాధ్యక్షులు ఎన్.ఆర్ లక్ష్మన్‌రావుగుప్త కోరారు. గౌలిగూడ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్ బలిదానం దినోత్సవాన్ని పురస్కరించుకుని భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో మనోజ్, బసంత్‌సింగ్, అశోక్‌శైనీ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారి దేవాలయంలో పూజలు



అఫ్జల్‌గంజ్, మార్చి 23 ప్రభాతవార్త: ఉగాది నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జియాగూడ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు.శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ అంజనేయులు ముదిరాజ్ తెలిపారు. అమ్మవారి 24వ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి అభిషేకము, యజ్ఞము, సత్యనారాయణ స్వామి వ్రతపూజలను నిర్వహించారు.భక్తులకు అన్నదానం చేశారు.సుదర్శన్ ముదిరాజ్,పి.బాలకృష్ణ, శ్రీనివాస్, ఎ.బాలకృష్ణ, అరవింద్, మనోహర్ థాక్రే, అరవిందలతోపాటు ఆలయ అర్చకులు భరద్వాజ్ భక్తులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : శంకర్ రావ్



భగత్ సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నేత శంకర్ రావ్ తదితరులు

అడ్డగుట్ట, మార్చి 23 ప్రభాతవార్త: కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్‌రావ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్‌రాజ్‌గురు వర్ధంతిని పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్‌లోని మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి రవిందర్, కో-ఆర్డినేటర్‌లు ఫరూక్, రవిచంద్ర, స్వామి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతాధికారులతో నిజాంపేట మేయర్ సమీక్షా



సమీక్షా సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

నిజాంపేట్, మార్చి23 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఉన్నతాధికారులతో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో రోడ్డు విస్తరణ, రోడ్డు ప్యాచ్‌వర్కులు, డ్రైనేజీ, ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు, కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఇంఛార్జి కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్ బాలాజీనాయక్,ఎన్ఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ విద్యార్థులు లేకుండా గ్లోబల్ యూనివర్సిటీ కాలేవు

**అమెరిక్ యూనివర్సిటీ అధ్యక్షులు మార్క్ పి.క్రిస్టెన్‌సెన్**



కార్యక్రమంలో పాల్గొన్న క్రిస్టెన్‌సెన్, అశోక్ కల్లం

హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త: భారతీయ విద్యార్థులు లేకుండా ఏవిశ్వ విద్యాలయం నిజంగా గ్లోబల్ యూనివర్సిటీ అనిపించుకోదని యూఎస్ఏలోని 125ఏళ్ల క్లార్కసన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ మార్క్ పి.క్రిస్టెన్‌సన్ అన్నారు. ఇండియాలోని నాలుగు నగరాల పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్‌కు వచ్చారు. ఈసందర్భంగా గచ్చిబౌలిలోని స్కైవ్యూలోని కోవర్క్స్ ఇండోగ్లోబల్ స్టడీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశం పెద్దదేశం అని విదేశాల్లో చదువుకో వడానికి ఇష్టపడే విద్యార్థులకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతిసంవత్సరం 60మిలియన్ల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్ అవుతున్నారని ప్రతిసంవత్సరం 2లక్షలమంది విద్యార్థులు అమెరికాకు చదువుకోసం వెళ్తున్నారన్నారు. ఇండ్లో గ్లోబస్ స్టడీ వ్యవస్థాపకులు అశోక్ కల్లం మాట్లాడుతూ భారతీయ విద్యార్థులు అందులోనూ తెలుగు విద్యార్థులు యుఎస్ఏలోని 4వేల యూనివర్సిటీల్లో కేవలం 350 యూనివర్సిటీలనే తమ అధ్యయనాలకోంస ఎంచుకుంటున్నార న్నారు. ఈకార్యక్రమంలో క్రిస్టెన్‌సన్ భార్య సీమా గ్రోవర్ క్రిస్టెన్‌సన్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌తో కార్పొరేట్ వైద్యం అందుతుంది

**గండిపేట్ బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా**



కోకాపేట్‌కు చెందిన లబ్దిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న గండిపేట్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు నర్సిహ్మా, హరిశంకర్‌లు

నార్సింగి, మార్చి 23 ప్రభాతవార్త : సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం అందుతుందని గండిపేట్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపల్ కోకాపేట్ గ్రామానికి చెందిన యం.సోమ శేఖర్‌కు రూ.60.వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బిఆర్ఆస్ సీనియర్ నేత హరిశంకర్‌తో కలిసి నర్సిహ్మా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ సర్కారు ఏర్పడితన తరువాత నిరుపేదలు పెద్ద జబ్బులు వచ్చినా ప్రాణభయం లేకుండా కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేసుకోవచ్చని ధీమాతో ఉన్నారన్నారు. సమైక్య రాష్ట్రంలో ఏడాదికి ఒకరిద్దరికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేది కాదని, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి నిధులు మంజూరు చేస్తు ఆదుకుంటున్నారని తెలిపారు. స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం రిలీఫ్ ఫండ్ నిధిని కూడా సీఎం కేసీఆర్ రెట్టింపు చేశారని వివరించారు. పేదరికంలోని కష్టనష్టాలు తెలిసిన నేత సీఎం కావడం తెలంగాణ ప్రజల అదృష్టమని తెలిపారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పతకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, దేశంలోనే తెలంగాణను అన్ని రంగాలలో అగ్ర స్థానంలో నిలిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోకాపేట్ నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే నివాసంలో..** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నివాసం వద్ద బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌కు చెందిన శివలింగంకు రూ.46.వేల చెక్కు, కిస్మత్‌పూర్‌కు చెందిన బందారి యశోదకు రూ.28.వేల చెక్కు, బండ్లగూడకు చెందిన సయ్యద్ షఫీకి రూ.26.వేల చెక్కు, దర్గా ఖలిస్కాన్‌కు చెందిన అంజాదుల్లాఖాన్‌కు రూ.14.వేల చెక్కులను ప్రకాశ్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌స్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు మలాకి రత్నం, జగదీష్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్యామ్, రాజు, గౌస్‌బేగ్, షానవాజ్, సరానదర్‌భేగ్, అసద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల గూడు కోసం ప్రభుత్వం కృషి: కార్మిక శాఖామంత్రి మల్లారెడ్డి



కుత్బుల్లాపూర్, మార్చి 23 ప్రభాతవార్త : స్వర్గీయ పెంచల్‌రెడ్డి ఆశయసాధనలో భాగంగా నిరుపేదలకు వసతులకల్పనలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని రాష్ట్ర కార్మికశాఖామంత్రి సి.హెచ్. మల్లారెడ్డి అన్నారు. గురువారం చింతల్ డివిజన్ స్వర్గీయ భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని భగత్‌సింగ్‌నగర్‌లో బస్తీ వ్యవస్థాపకులు స్వర్గీయ పెంచల్‌రెడ్డి , ఆజాద్ భగత్‌సింగ్‌ల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అలుపెరగని ఉధ్యమ నాయకుడుగా నిరుపేదల సంక్షేమం కోసం తన ప్రాణాలను అర్పించిన స్వర్గీయ పెంచల్‌రెడ్డి భగత్‌సింగ్ నగర్‌లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ నిరుపేదల గుండెల్లో స్వర్గీయ పెంచల్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని కొనియాడారు. భగత్‌సింగ్‌వంటి దేశవిప్లవ కారుడి పేరుతో ఏర్పడిన భగత్‌సింగ్‌నగర్ సంక్షేమానికి నిరంతరం కట్టుబడి వుంటానని హామీఇచ్చారు. ఎంఎల్‌సి, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు మాట్లాడుతూ భగత్‌సింగ్‌బాటలో స్వర్గీయ పెంచల్‌రెడ్డి బస్తీఏర్పాటుకు చేసిన కృషి చిరస్మరనీయమన్నారు. భారతీయ జనతాపార్టీ నాయకులు, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ స్వాతంత్రంకోసం ప్రాణాలు అర్పించిన బాటలోనే స్వర్గీయ పెంచ ల్‌రెడ్డి పయనించారని అన్నారు. స్వర్గీయ పెంచ ల్‌రెడ్డి కుటుంబ సభ్యులు తంగ రమ, వై.జనార్ధన్‌రెడ్డిల తోపాటు మల్కాజిగిరి లోక్‌సభ నాయకులు మర్రి రాజశేఖర్‌రెడ్డి, బిజెపి నాయకులు రాజా సదానంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు టిపిసిసి ప్రతినిధి కొలను హనుమంతరెడ్డి, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్పొరేటర్లు మహ్మద్ రఫీ, కొలుకు ల జగన్, రావుల శేషగిరిరావు, మంత్రి సత్యనారాయణ, సురేశ్‌రెడ్డి, గౌరిష్, సిపిఐ నాయకులు ఉమామహేశ్, కా.ఏసురత్నం పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు ఆజాద్ భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించు కుని ఆజాద్ భగత్‌సింగ్, స్వర్గీయ పెంచల్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఎంల్‌సి, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## జెబిఎస్ సమీపంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి : టీ.ఎన్



దివంగత ఎమ్మెల్యే సాయన్న విగ్రహం ఏర్పాటుకు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేసుస్తున్న బిఆర్ఎస్ నేతలు టీ.ఎన్.పనస సంతోష్, సరిత, రంగ రవిందర్ గుప్త తదితరులు

కంటోన్మెంట్,మార్చి 23 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన దివంగత సాయన్న కాంస్య విగ్రహాన్ని సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయుటకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గురువారం బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు పనస సంతోష్, నాగినేని సరిత, రంగరవిందర్ గుప్తల ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. 30 సంవత్సరాల రాజకీయ అనుభవం కలిగి 25 సంవత్సరాల పాటు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు, నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన దివంగత ఎమ్మెల్యే సాయన్న కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు అనుమతి ఇవ్వాలని వినపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు చొల్లేటి రమేష్, సదానంద్ గౌడ్, భాస్కర్ ముదిరాజ్, సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్‌గుప్త, కాంగ్రెస్ నేత దేవుడు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలే నా బలగం, నా బలం : ప్రభుత్వవిప్ గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 23, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే నా బలగం, నా బలం అని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ ఆధ్వర్యంలో హైదరనగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన హైదర్‌నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావులతో కలిసి ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ చేసిన ఎన్నో ఉద్యమాలు పోరాటాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని, సాధించుకున్న రాష్ట్రంలో రెండు సార్లు అధికారం చేపట్టి తెలంగాణ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేడు దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని అన్నారు. పరిపాలనా విషయంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం దిక్సూచిగా మారిందని, నేడు యావత్ దేశం మొత్తం తెలంగాణ వైపు చూసే విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

**కమిషనర్ సత్యనారాయణరావు**



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్, మార్చి 23 ప్రభాతవార్త : పోషణ్ పక్వాడ్ అభియాన్ సందర్భంగా మున్సిపల్ అధికారులు గురువారం గండి మైసమ్మలోని ప్రేమాంజలి చిల్డ్రన్‌హోమ్‌లో పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా కమీషనర్ సత్యనారాయణరావు చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంతో పాటు అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్పందన, చిల్డ్రన్‌హోమ్ ఇంచార్జి సిస్టర్ అమృత, అంగన్‌వాడీ టీచర్ మీనదేవి తదితరులు పాల్గొన్నారు.

## ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలు

**దిశానిర్దేశం చేసిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**



ప్రసంగిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, మార్చి 23 ప్రభాతవార్త: బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకుగాను ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనకార్యక్రమాలను నిర్వహించబోతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఇందులో భాగంగా డివిజన్‌లవారీగా ఈ కార్యక్రమాలుంటాయని, ఆయా డివిజన్‌లలో జరిగే కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, జిల్లా ఇంచార్జ్ డాక్టర్ దాసోజు శ్రావణ్‌కుమార్‌తో పాటు, నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. గురువారం సాయంత్రం ముషీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకుచెందిన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ముఠాగోపాల్ సమావేశమై దిశానిర్దేశం చేశారు. 27న కవాడిగూడలోని ఆర్ కన్వెన్షన్‌లో, ఏప్రిల్ 2న అడిక్‌మెట్, 9న ముషీరాబాద్, 16న రామ్‌నగర్‌లోని ఎస్ఆర్సీర్టీ కమ్యునిటీ హాల్‌లో, గాంధీనగర్ డివిజన్‌లో 3 లేదా 4, 9న ముషీరాబాద్, బోలక్‌పూర్‌లోని గంగపుత్ర సంఘం భవన సముదాయాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, గాంధీనగర్, రామ్‌నగర్, అడిక్‌మెట్, కవాడీగూడ డివిజన్ పార్టీ అధ్యక్షులు ఎం.రాకేశ్‌కుమార్, ఆర్.మోజెస్, శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామనయాదవ్‌తో పాటు పార్టీ నేతలు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, గుండు జగదీశ్,పెంటారెడ్డి, రవిశంకర్ గుప్త, శివాముదిరాజ్, ముదిగొండమురళీ, వెల్లంకి ఇంద్రసేనారెడ్డి, మన్నె దామోదర్‌రెడ్డి, అయిలినేని కిషన్‌రావు, ఆర్.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్



పోగొట్టుకున్న బాధితుడికి బ్యాగును అందజేస్తున్న ఇన్స్‌పెక్టర్ నర్సింగ్‌రావు, కానిస్టేబుల్ శ్రీకాంత్

మూసాపేట, మార్చి 23, ప్రభాతవార్త : ఒక వ్యక్తి పోగొట్టుకున్న కొంత డబ్బు, విలువైన పత్రాలు ఉన్న బ్యాగు కానిస్టేబుల్‌కు దొరగ్గా దానిని బాధితుడికి అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్నాడు. గురువారం కూకట్‌పల్లి ట్రాఫిక్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తొండపల్లి శ్రీకాంత్‌కు మెట్రో పిల్లర్ నెంబర్ 822 వద్ద ఒక బ్యాగు దొరికింది. దొరికిన బ్యాగును తెరచి చూడగా అందులో 71వేలు నగదు, విలువైన పత్రాలు లభ్యమయ్యాయి. నిజాయితీగా అతను ఆ బ్యాగును కూకట్‌పల్లి ఇన్స్‌పెక్టర్ నర్సింగ్‌రావుకు అందజేశారు. కూకట్‌పల్లి పోలీసులు బ్యాగులో ఉన్న పత్రాల ఆధారంగా బాధితుడైన ఐడిపిఎల్‌కు చెందిన కృష్ణను కనిపెట్టి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సిఐ నర్సింగ్‌రావు, ట్రాఫిక కానిస్టేబుల్ శ్రీకాంత్ అతనికి నగదు, పత్రాలను అందజేశారు.

## ఎం.డి. మోయిన్‌కు ఘన సన్మానం



మెహిదీపట్నం, మార్చి 23, ప్రభాతవార్త : మెహిదీపట్నం ఆర్టీసి డిపోలో గత 12 సంవత్సరాలుగా డిపో కంట్రోలర్‌గా విధులను నిర్వహించిన ఎం.డి.మోయిన్ ప్రమోషన్‌పై మిథాని డిపోకు వెళ్తుండడంతో శుక్రవారం డిపో ఆవరణలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎం.డి. మోయిన్‌కు శాలువతా కప్పి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ హైదరాబాద్ రీజినల్ సెక్రటరీ బుల్లెట్ పాండు, మెహిదీపట్నం డిపో సెక్రటరీ వాసుదేవ్ యూనియన్ నాయకులు యాకూబ్, లింగం, వెంకటయ్య, కలీల్, అశోక్‌లు ఉన్నారు.

## టైలరింగ్‌లో ఉచిత శిక్షణ



మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, మార్చి23 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ పనిలో శిక్షణను అందించి వారికి సర్టిఫికెట్లను గురువారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణను అందించి ప్రోత్సహిస్తున్న నిర్మాణ్ సంస్థ నిర్వాహకులను అభి నందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వనజ, శిరీష,ఝాన్సీ,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : గుర్తుతెలియని టిప్పర్ వాహనము ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్ పెట్ గోకుల్ నగర్ లో నివాసం ఉండే రాజు (30) నాగారంలో ఓ ప్రైవేట్ స్వీట్ దుకాణంలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా గురువారం ఉదయం గోకుల్ నగర్ తన ఇంటి నుండి పల్సర్ వాహనంపై బయలుదేరి నాగారంలో గల సీట్ హౌస్ కి ఉద్యోగ నిమిత్తం వెళుతుండగా ఉదయం 8 గంటల ప్రాంతంలో కుషాయిగూడ వద్ద ఓ గుర్తు తెలియని పసుపు రంగులో గల టిప్పర్ వాహనము అతివేగంగా ఢీకొట్టడంతో రాజు అక్కడికక్కడే తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. టిప్పర్ వాహనాన్ని గుర్తించడానికి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గోల్నాక డివిజన్‌పై అధికారులతో కార్పొరేటర్ సమీక్షా



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న లావణ్యశ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్ అభివృద్ధిపై స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ గురువారం కార్పొరేటర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు వేణుగోపాల్, జ్యోతిబాయి, విష్ణువర్ధన్‌రావు, రోహిత్ తదితరుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని, డ్రైనేజీ, వాటర్‌లైన్ నిండిపోయి ఉన్న దగ్గర డీసిల్టింగ్ చేయాలని, ప్రజలు ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కరించాలని, వీధిలైట్లు లేని చోట ఏర్పాటు చేయాలని, కుక్కల బెడద ఉన్న ఏరియాల్లో ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఆమె విజ్ఞప్తులపై స్పందించిన అధికారులు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

## జిఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావు**



ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న రంగారావు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 23, ప్రభాతవార్త : పేద విద్యార్థుల కోసం జీఆర్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పేర్కొన్నారు. గురువారం శేరిలిగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్ పరిధిలో గల వెంకటేశ్వరనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్‌లో చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు స్థాపించిన జిఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా 10వ తరగతి విద్యార్థులకు మాజీ కార్పొరేటర్ రంగారావు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తున్న ఎగ్జామ్స్ ప్యాడ్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఎగ్జామ్స్ బాగా రాసి ఎవరైతే 10/10 జిపి ఘనత సాధిస్తారో వారికి ట్యాబ్‌లు బహుమతిగా ఇవ్వబడుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఆంజనేయులు, బాబు, స్వరూప, శ్రావణ్‌రెడ్డి, సతీష్, ఎర్ర లక్ష్మయ్య పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు వినతి పత్రాలు అందజేస్తున్న వివిధ కాలనీవాసులు

దుండిగల్, మార్చి 23 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమసంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు గురువారం ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమతమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలను అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి ఆయా కాలనీలో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరితంగా పరిష్కరిస్తానని హామినిచ్చారు.

**పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం**

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈమేరకు ఎసిపి చంద్రశేఖర్, బాచుపల్లి సిఐ నర్సింహారెడ్డిలు గురువారం ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి ప్రారంభోత్సవ కార్యాక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్**



లాలాపేట్ స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

తార్నాక, మార్చి 23 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం లాలాపేట్ ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన ఎంకె మోటార్స్‌ను ఆయన ప్రారంభించిన అనంతరం లాలాపేట్ ప్రొ. జయశంకర్ స్టేడియం ఆవరణలో రూ. 6.99 కోట్లతో జరుగుతున్న లాలాపేట్ స్విమ్మింగ్ పూల్, మల్టిపర్పస్ హాల్ నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ లేనివిదంగా అభివృద్ధి పనులను నియోజక వర్గంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సిహెచ్.సునిల్ ముదిరాజ్, లాలాపేట్ లల్లూ ముదిరాజ్, పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్, నాగేశ్వర్ రావు గౌడ్, కూరెల్లి నాగరాజు గౌడ్, ఎర్రనాగు, ఎంకె మోటర్స్ యజమాని ఎండి.సలీంతో పాటు పలువురు పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

# ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : కలెక్టర్



కలెక్టర్ హరీష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త : జీవో నెంబర్ 118 పై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 118జిఓలో తదుపరి కార్యాచరణ, ఇతర సమస్యల పరిష్కారం గురించి ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ హరీష్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన వారందరికీ డిమాండ్ నోటీస్ వస్తుందని హామీనిచ్చారు. నోటీస్ వచ్చినవారు ఈ సేవ, మీ సేవలో ఆన్‌లైన్‌ద్వారా లేదా ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఈ నెల 31 లోగా ఛలానా ద్వారా డబ్బులు చెల్లించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొత్తగా మీసేవలో 118 జీఓలో రెగ్యులరైజేషన్ కోసం రూ.500 చెల్లించినవారికి వెరిఫికేషన్ ప్రక్రియ చేయిస్తామని తెలిపారు.

**ఎమ్మెల్యేకు ధన్యవాదాలు..** ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పలువురు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యకు చరమగీతం పాడే విషయంలో ఎమ్మెల్యే తీసుకున్న చొరవపట్ల కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్, బిఎన్ రెడ్డినగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, హస్తినపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సత్యం చారి, రఘుమారెడ్డి, శ్రీనివాస్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, పొగుల రాంబాబు, సాయిబాబా, ముత్యంరెడ్డి, అంజిరెడ్డి, కృష్ణరెడ్డి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

# రాఘవేంద్రకాలనీలో మల్టీపర్పస్ కమ్యూనిటిహాల్ : గీత



రాఘవేంద్రనగర్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని జిహెచ్ఎంసికి అప్పగిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: చిలుకానగర్ రాఘవేంద్రనగర్ కాలనీలో సుమారు 243 గజాల ప్రభుత్వ స్థలాన్ని మల్టీపర్పస్ కమ్యూనిటిహాల్‌కు కేటాయించినట్లు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాఘవేంద్రనగర్ కాలనీలో 243 ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ సర్వేయర్ ప్రశాంత్, ఆర్ఐ సుధ అడ్వాన్స్ పొజిషియన్ పత్రాలను టౌన్‌ప్లానింగ్ ఎసిపి వెంకటరమణ, టిపిఎస్ మౌనికలకు అందజేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాఘవేంద్రనగర్ కాలనీలో మల్టీపర్పస్ కమ్యూనిటిహాల్ నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురి కాకుండా అధికారులతో కలిసి సర్వే చేయించి జిహెచ్ఎంసికి కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తు చేసి స్థలం కాలనీకి వచ్చే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. కాలనీకి స్థలం కేటాయించే విషయంలో సహకరించిన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి, తహసీల్దార్ గౌతమ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు టంకశాల అశోక్, కాలనీ సంఘం నేతలు కౌశిక్, డా.పద్మయ్య, డా.ఉదయ్, సోమేష్, శ్రీధర్, బాలరాజు, అరుణ్‌కుమార్, డా.లింగయ్య, కృష్ణమూర్తి, కేశవ రెడ్డి, బిఆర్ఎస్ నేతలు కొండల్‌రెడ్డి, కె.జగన్, ఎం.శ్రీనివాస్, రామానుజం, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృది పనులు పరిశీలన : కార్పొరేటర్ సునీత రామూయాదవ్



నాలాపనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాలమేరకు గౌతమ్‌నగర్‌పరిధిలోని ఉత్తమ్ నగర్‌లో రూ. 55 లక్షలతో చేపట్టిన బాక్స్ డ్రైన్ నాలా స్లాబ్ పనులను కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్, ఏఈ దివ్యజ్యోతి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణిత సమయానికి పూర్తి చేసేలా చేర్యలు తీసుకోవాలని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్ ఉన్న పనులను ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు, కాలనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కవులకు సన్మానం

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: శోభకృత్ నామ ఉగాది సందర్భంగా నగరంలోని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన కవి సమ్మేళనంలో మీర్‌పేట్ కవులకు సన్మానం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మీర్‌పేట్ నందిహిల్స్‌కు చెందిన కవులు హన్మంత్‌రెడ్డి, వీణారెడ్డిలను ఘనంగా సనా ్మనించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను అభినందించారు.

## గృహ నిర్బంధం అప్రజాస్వామికం



పోలీసుల అదుపులో చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ నాయకులను గృహనిర్బంధం చేయడం అప్రజాస్వామికమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. టీఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై సిట్ విచారణ ఉన్న నేపథ్యంలో ఆర్కేపురంలోని ఉపేందర్‌రెడ్డి నివాసంవద్ద ఆయనతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలను చైతన్యపురి పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలలో తరిమికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దవూర సైదులు, కళ్యాణ్, రాజునాయక్, వంగాల శ్రీకాంత్, ప్రేమ్‌నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి : చెకోలేకార్



సిట్ కార్యాలయం ముట్టడికి తరలిన చెకోలేకార్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకార్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మలక్‌పేటనుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి సిట్ కార్యాలయం ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులైన వారందరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వెంటనే టిఎస్‌పిఎస్‌సిని పూర్తిగా రద్దు చేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

## తుర్కయంజాల్‌లో హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు ప్రారంభం



బ్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి 21వార్డు సాగర్ రహదారిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సేవలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బ్యాంకు సేవలను అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజలకు బ్యాంకు సిబ్బంది అందుబాటులో ఉండి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కౌన్సిలర్ కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, భారాస సీనియర్ నాయకులు కందాడ లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, సామ సంజీవ రెడ్డి, చెవుల దశరథ, కొంతం యాదిరెడ్డి, విజయానంద్ రెడ్డి, ఆర్ల కృష్ణ, సంపతీశ్వర్‌రెడ్డి, గుండ్ల రాజిరెడ్డి, రొక్కం ప్రభాకర్ రెడ్డి, గౌని వినోద్, చెవుల దశరథం, శ్రీశైలం, మేతరి శంకర్, కోంద్రు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: మీర్‌పేట్ కార్పొరేషన్ మీర్‌పేట్ చౌరస్తాలో గురువారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాసరి అరవింద్ తదితరులు అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దాసరి బాబు, పెంటయ్య, బిఆర్ఎస్ నాయకులు తీగల సాయినాథ్‌రెడ్డి, నర్సింహ, ఉపేందర్, శంకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో రోడ్లు వేయాలని, లోతట్టు ప్రాంతాల్లో ఎస్ఎన్‌డీపీ నాలాపై సీసీవేయాలని, కుమ్మరికుంట కట్టపై రోడ్డు వేయాలని కోరుతూ హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోనిఆయాకాలనీల్లో రోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రోడ్లకు అవసరమైన మేర నిధులను మంజూరు చేయాలన్నారు. ఎస్ఎన్‌డీపీ నాలా పనుల కారణంగా కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ పైపులు ధ్వంసమయ్యాయని ఏడాది గడుస్తున్నా వాటికి మరమ్మతులు చేయడం లేదన్నారు. వెంటనే మరమ్మతులు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. కుమ్మరికుంట చెరువు కట్టను వెడల్పు చేయడంతో పాటు దానిపై రోడ్డువేసి సుందరీకరణ పనులు పూర్తి చేయాలని కోరారు.

## భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి: హరిగౌడ్

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిజెపి ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ అన్నారు. సైదాబాద్ డివిజన్ రెడ్ క్రాస్ చౌరస్తాలో జరిగిన కార ్యక్రమంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర ్పించారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి రాజేష్, లింగాల శ్యామ్‌గౌడ్, మెడి శ్రీను, చంద్రకుమార్, మహేష్, వెంకటేష్, పటాలే నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకమండలి ప్రమాణ స్వీకారానికి కార్పొరేటర్ శాంతిశేఖర్‌కు ఆహ్వానం

నాచారం, మార్చి 23 ప్రభాతవార్త: నాచారం ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవా కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరు కావాలని కోరుతూ కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేకర్‌కు గురువారం ఆహ్వాన పత్రికను సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, చంద్రశేఖర్, ఉమామహేశ్వర చారి, శ్రీనివాస్ నాయక్, ప్రభాకర్, సుబ్బారావు, శ్రీధర్, సురేందర్ స్వామి, దత్తన్న, కాళిదాస్, సాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

## నిర్బంధం నుండి తప్పించుకొని సిట్ కార్యాలయానికి చేరిన దేప



రేవంత్‌రెడ్డికి మద్దతుగా వెళుతున్న దేప భాస్కర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త : మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పోలీసుల నిర్బంధం నుంచి తప్పించుకొని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. టీఎస్‌పిఎస్‌సి పేపర్‌లీక్‌పై టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై సిట్ విచారణ ఉన్న నేపథ్యంలో రేవంత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిట్ కార్యాలయానికి వెళ్లకుండా అక్రమ అరెస్టులు చేస్తున్న పోలీసుల కళ్ళు గప్పిన భాస్కర్‌రెడ్డి తప్పించుకొని రేవంత్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమానికి హాజరై నైతిక మద్దతు తెలిపారు. సిట్ కార్యాలయానికి చేరుకున్నా భాస్కర్‌రెడ్డి రేవంత్‌రెడ్డిని కలిశారు. పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామికమని భాస్కర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, బండి మధు, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, రమేష్‌నేత, ఎన్ఎస్‌యుఐ శివ పెద్దవూర సైదులు నాయకులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: శరీరంలోని అన్ని అవయవాలలో కళ్ల ఎంతో ప్రధానమైనవని సరైన పౌష్టికాహారం తీసుకుని వాటిని కాపాడుకోవాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు పథకంలో భాగంగా వార్డు పరిధిలోని శ్రీ సాయి కుటీర్‌లో గురువారం ఆయన కమిషనర్ సత్యనారాయణరెడ్డితో కలిసి కంటిపరీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... కంటి చూపు మెరుగుపరుచేందుకు అవసరమైన విటమిన్లు ఉండే ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో తీసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డును వెంట తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## వరద నీటి కాల్వ పనులు : శ్రీవాణి



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : రామంతాపూర్ రాంశంకర్‌నగర్‌లో చేపడుతున్న వరద నీటి కాలువ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాంశంకర్‌నగర్, భరత్‌నగర్‌లో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వరద నీటి కాలువ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపిడివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, డిఇ నాగమణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, నేతలు కుమారస్వామి, నరసింహ, శ్రీనివాస్, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## సమస్యను పరిష్కరించడంతో ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : సఫిల్ గూడ రైల్వే స్టేషన్ నుండి శివమ్ టెంపుల్ వరకు బీ.టీ.రోడ్డు డ్యామేజ్ కావడంతో స్థానికులు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి తీసుకు రావడం జరిగింది. ఈ మేరకు ఎమ్మెల్యే వెంటనే స్పందించి మిలటరీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బీ.టి.రోడ్డు వేయించారు. వెంటనే బి టి రోడ్డు సమస్యను పరిష్కరించడంతో స్థానికులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## శివకుమార్‌గౌడ్ కుటుంబానికి పరామర్శ : ఎమ్మెల్యే మంచిరెడ్డి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంచిరెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి చనిపోయిన తుర్కయంజాల్ వాసి, ఎస్‌బిఐ ఉద్యోగి గౌని శివ కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి శివ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కందాడ లక్ష్మారెడ్డి, ముత్యం రెడ్డి, సామ సంజీవరెడ్డి, చెవుల దశరథ, కొంతం యాదిరెడ్డి, చెవుల శ్రీశైలం, పుల్లగుర్రం విజయానంద్‌రెడ్డి, ఆర్ల కృష్ణ, సంపతీశ్వర్‌రెడ్డి, గుండ్ల రాజిరెడ్డి, గౌని వినోద్, మేతరి శంకర్, రొక్కం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శివకుమార్‌గౌడ్‌కు ఆర్థిక సహాయం...** గౌని శివకుమార్‌గౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య, శివకుమార్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబానికి ముగ్గురు కలిసి 30వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను యువత ఆదర్శంగా తీసుకోవాలి



స్వతంత్ర వీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: దేశ స్వతంత్ర పోరాటంలో పిన్నవయసులోనే అసువులు బాసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామపరిధి రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3లో అఖిలభారత విద్యార్థి, యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మహానాయకుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి మాట్లాడుతూ... స్వతంత్ర పోరాటంలో ఆంగ్లేయులను ఎదురించిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఉరికంభానికి ఎక్కారని తెలిపారు. వారి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని సూచించారు. సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, చింత వెంకటేష్ ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, పోలోజు లక్ష్మణ్, హరిసింగ్‌నాయక్ పాల్గొన్నారు.

**60 అడుగుల ఎత్తు పార్టీ జెండా ఆవిష్కరణ...** సీపీఐ ఆధ్వర్యంలో రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3లో కొనసాగిస్తున్న భూపోరాటం 60 రోజులు పూర్తయిన సందర్భంగా నాయకులు 60 అడుగుల ఎత్తులో పార్టీ పతాకాన్ని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం భూదాన, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా చూడడంతో పాటు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## భగత్ సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి : సత్యప్రసాద్



భగత్ సింగ్ వర్ధంతి జరుపుతున్న దృశ్యం.

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : భారతదేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని అఖిలభారత యువజన సమైక్య మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోట సత్య ప్రసాద్ పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ 92వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించి బ్రిటిష్ వారిని గడగడలాడించిన సర్దార్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవుల ఆశయాలను అమలు జరపాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ టింకు, ప్రవీణ్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో కార్మిక రంగానికి తీవ్ర అన్యాయం: పురుషోత్తం



లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న పురుషోత్తం

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : కేంద్ర బడ్జెట్‌లో కార్మిక రంగానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఎఐసిటియు) తెలంగాణ రాష్ట్రఉపాధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం ఆందోళన వ్యక్తం చేశారు. 2023-2024 కేంద్ర బడ్జెట్‌లో కార్మికరంగానికి సరైన నిధులను కేటాయించక పోవడాన్నినిరసిస్తూ ఎఐసిటియు కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం నగరంలోని లేబర్‌కమీషనర్ కార్యాలయంలో ఆయన ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ బడ్జెట్‌లో కేంద్రం కార్మిక సంక్షేమానికి సరిపడినన్ని నిధులు కేటాయించకపోగా ప్రభుత ్వ రంగసంస్థలను కార్పొరేట్ సంస్థ లకు ధారాదత్తం చేస్తున్నదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కార్మికులకు అండగా నిలబడ్డ ఎఐసిటియు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయవద్దని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నదని స్పష్టం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలనీ, ఇఎస్ఐ, పిఎస్ సౌకర్యం కల్పించాలనీ, ఉద్యోగ భద్రత కలి ్పించి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుజాత పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధం కావాలి

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి మండలం మల్లికార్జున్ నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి టి.యాదయ్యగౌడ్ మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారని చివరకు ఉరి కంభాన్ని సైతం ఎక్కారన్నారు. యువత అందరూ కూడా ఆయనను ఆదర్శంగా తీసుకొని కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి, నాయకులు టి.సాయిగౌడ్, నిరంజన్ గౌడ్, జి.రాములు, ఎం.లింగం, జన్ను, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ పిఎస్ పరిధిలో కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సిట్ విచారణకు హాజరైన నేపథ్యంలో ఆయన పిలుపుమేరకు సిట్ కార్యాలయానికి వెళ్ళడానికి సిద్ధమవుతున్న కాంగ్రెస్ నేతలను గురువారం మీర్‌పేట్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల అధికారుల ఆదేశాల మేరకు మీర్‌పేట్ పోలీసుల బృందం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, మల్గారి శ్రీధర్‌రెడ్డి, భాను, అనిల్, ధనుష్ తదితరులను వారి వారి ఇళ్ళ వద్ద గురువారం తెల్లవారు జామునే అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

## బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి హౌస్ అరెస్టు



అరెస్టులను ఖండిస్తున్న మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిని గురువారం బాలాపూర్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ బోర్డు పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంలో టి సర్కార్‌పై పలు ఆరోపణలు చేసిన టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తగు ఆధారాలతో సిట్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరైన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో నగరం, శివార్లలో ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టులు జరిగాయి. ఇందులో భాగంగా బాలాపూర్ పోలీసులు బాలాపూర్‌లోని మేయర్ నివాసానికి వెళ్ళి అక్కడ పారిజాతతో పాటు ఆమె భర్త నర్సింహారెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచారు. తమ అరెస్టులను పారిజాత తీవ్రంగా ఖండించారు. నిరంకుశ పాలనతో అణచివేతకు పాల్పడే ప్రయత్నం చేస్తే ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు.

## సమతానగర్ సాయిబాబా అలయంలో కళ్యాణ మండపం భూమి పూజ



కళ్యాణ మండపం భూమి పూజలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి..

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినాయక్‌నగర్ డివిజన్ సమతనగర్ సాయి బాబా అలయంలో నూతనగా చేపట్టిన కళ్యాణ మండపం భూమి పూజ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయి : ప్రబుదాస్



క్రీడలు ఆడుతున్న కార్పొరేటర్ ప్రబుదాస్ తదితరులు

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరధారుఢ్యాన్ని పెంపొందిస్తాయని మీర్పేట్ డివిజన్ కార్పొరేటర్ జరిపోతుల ప్రబుదాస్ పేర్కొన్నారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2023 కార్పొరేటర్స్ స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ఇతర కార్పొరేటర్లతో కలిసి క్రికెట్, టెన్నిస్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ల మధ్య అవగాహన పెంపొందించుకోవడానికి సైతం దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి విజయ్‌కుమార్‌గౌడ్ రాజ కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ మీట్‌లో సందడి చేసిన డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి



కార్పొరేటర్ శైలజతో క్యారమ్స్ ఆడుతున్న శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, మార్చి 23 ప్రభాతవార: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంపై బిజీగా ఉండే నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని విక్టరీ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన కార్పొరేటర్ల స్పోర్ట్స్ మీట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సహచర కార్పొరేటర్లతో వివిధ రకాల ఆటలుఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. క్యారమ్స్, చదరంగం, షటిల్ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్రీడలు, వ్యాయామం జీవితంలో ఒక భాగం కావాలన్నారు.

## విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి



అంజనీకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త : విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ సిపిస్సీ కోర్టు సూపరింటెండెంట్ పివిపి అంజనీకుమారి పేర్కొన్నారు. హైదరాబాద్ కళాజాగృతి, యువతేజం, కలాం విజన్ సంయుక్త ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మణిపూర్ గ్రామం హవేలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. అదే విధగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ఎగ్జామ్ ప్యాడ్లు, మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, పద్మ, అలపాటి, కరీముల్లా, రత్నాకర్‌శర్మ, నరేష్, రామదాసు తదితరులు పాల్గొన్నారు.